సాక్షి హనుమకొండ

శనివారం | 7 | జూన్ | 2025



అమాయక రైతులే లక్ష్యంగా..

ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగుమందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. - 10లో▸



త్యాగాల పండుగ.. బక్రీద్

ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ బక్రీద్. నేడు ఈదుల్ జుహా సందర్భంగా జిల్లాలోని పలు ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేయనున్నారు. - 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $37^0/28^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోతగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పరిశోధనా పద్ధతులపై అవగాహన ఉండాలి



కేయూ క్యాంపస్: వివిధ సామాజిక అంశాలపై పరిశోధనలు చేసేటప్పుడు పద్ధతులపై అవగాహన అవసరమని కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ అండ్ ఎంఎస్‌డబ్ల్యూ విభాగం అధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోషల్‌సైన్స్ పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశోధకులకు పరిశీలనలో నమూనా పద్ధతులను ఆమె వివరించారు. కేస్ స్టడీ అనేది కీలకంగా ఉంటుందన్నారు. సమావేశంలో ఆ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య, అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, పరిశోధకులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బొల్లం రమేష్

వరంగల్ క్రైం: వరంగల్ సబ్ డివిజన్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బొల్లం రమేష్‌ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొల్లం రమేష్ గతంలో ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు విద్యార్థుల ఎంపిక

విద్యారణ్యపురి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) కోసం గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన పరీక్షను అప్పటి ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు రాశారు. హనుమకొండ జిల్లాలో 628మంది పరీక్ష రాయగా, అందులో స్కాలర్‌షిప్‌నకు 68మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారికి ప్రతి ఏడాది ఒక్కొక్కరికి ఇంటర్ వరకు రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుంది.

బడిబాట షురూ

విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మండల విద్యాధికారులు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు. ఈనెల 19వ తేదీవరకు ఈ బడిబాట కొనసాగనుంది.

డీఈఈసెట్ అభ్యర్థులకు 9నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల ప్రవేశాలకుగాను ఈనెల 9నుంచి 13వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఈనెల 14నుంచి 17వ రకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సింటుందని తెలిపారు. పూర్తి వివరాలకు టీజీడీఈఈసెట్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

కొత్తమెనూ ప్రకారం వంటచేయాలి



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని కేజీబీవీ, టీజీఆర్‌ఈఐఎస్, యూఆర్‌ఎస్, మోడల్ స్కూళ్లలోని హాస్టళ్లలో కొత్త మెనూ ప్రకారం వంట చేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ మధుసూదన్ సూచించారు. కామన్ మెనూపై హసన్‌పర్తి కేజీబీవీలో శుక్రవారం వంట మనుషులకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన డీఆర్‌పీలు వివిధ రకాల వంటకాలు ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. సమావేశంలో జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సునీత, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు జ్యోతి, స్వప్న పాల్గొన్నారు.

రెండు కేజీబీవీల్లో ఎంఎల్‌టీ కోర్సు

విద్యారణ్యపురి: వరంగల్ జిల్లాలోని దుగ్గొండి, పర్వతగిరి కేజీబీవీల్లో ఈ విద్యాసంవత్సరం (2025-26) కళాశాల స్థాయిలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) కోర్సును నూతనంగా ప్రవేశపెట్టినట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో కేజీబీవీలో ప్రథమ సంవత్సరానికి 40 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తిగల బాలికలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

'అమ్మ ఆదర్శం'.. నిధుల లేమి!



సర్కారు పాఠశాలల్లో అసంపూర్తిగా మౌలిక వసతుల పనులు

- జిల్లాలో ఈ పథకం కింద 438 స్కూళ్ల ఎంపిక
- ఇప్పటివరకు 80శాతం పూర్తి.. మిగతా వాటి పరిస్థితి ఏమిటో..?
- రూ 9.39 కోట్ల నిధులు విడుదల.. ఇంకా రావాల్సినవి రూ.7.59 కోట్లు
- పనులు చేసినవారు బిల్లుల కోసం నిరీక్షణ

గ్రౌండ్ రిపోర్ట్

ఇటీవల పనులు ప్రారంభం..



విద్యార్థులు వాష్ చేసుకునే చోట..



తరగతి గదిలో కుంగిన బండలు

ఈ చిత్రంలోని ఫొటోలు చూడండి. హనుమకొండలోని జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరిస్థితి. ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పలు పనులకు రూ.3.40 లక్షలు మంజూరు చేశారు. అడ్వాన్స్‌గా రూ.85 వేలు (25శాతం) విడుదల చేశారు. మంజూరీ ఇచ్చి ఐదారునెలలు గడిచినా ఇటీవల పనులు మొదలెట్టారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తయ్యేలా లేవు. ప్రధానంగా టాయ్‌లెట్స్ రిపేర్, తరగతి గదుల్లో పాలిష్ బండలు వేయాల్సి ఉంది. హ్యాండ్‌వాష్ దగ్గర పనులు చేయాల్సి ఉంది.

విద్యారణ్యపురి:

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు నిధుల లేమితో నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలు మరో ఐదు రోజుల్లో పునఃప్రారంభంకానున్నాయి. కానీ, వాటిలో చేపట్టిన పనులు కొన్నిచోట్ల పూర్తికాగా, మరికొన్నింటిలో అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకొన్ని అసలు చేపట్టనేలేదు. దీంతో విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యాభ్యాసం సాగించాల్సి ఉంటుందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఏయే పనులు చేపట్టాలంటే..

కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోనికి వచ్చాక కొన్నినెలలకే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. అందులో ఎలక్ట్రిఫికేషన్, తాగునీటి వసతి, మరుగుదొడ్ల మూత్రశాలల రిపేర్లు, తరగతి గదుల్లో మైనర్, మేజర్ మరమ్మతులు చేయాలి. ఈ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. విడుదల చేసే నిధులను పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, హెచ్‌ఎంల బ్యాంక్ జాయింట్ అకౌంట్(ఏఏపీసీ)లో జమ చేస్తారు.

పనులు పూర్తయినా 25శాతం నిధులే..

జిల్లాలో అక్కడక్కడ పనులు పూర్తయినా తొలుత 25శాతం అడ్వాన్స్‌డ్‌గా విడుదల చేసిన నిధులేనని, తరువాత రాలేదని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు అంటున్నారు. ఉదాహరణకు హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో మేజర్ రిపేర్, మరుగుదొడ్లు, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల పనులకు రూ.10.10 లక్షల వరకు మంజూరు ఇచ్చారు. తొలుత అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.2.10లక్షలు మాత్రం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ద్వారా పనులు చేసినవారికి చెల్లింపులు చేశారు. మిగతా 75శాతం నిధులు (బిల్లులు) రావాల్సి ఉందని సంబంధిత హైస్కూల్ హెచ్‌ఎం నెహ్రూ తెలిపారు.

పనులు చేసినవారు నిరీక్షిస్తున్నారు..

- హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో వివిధ పనులకు రూ.4.50 లక్షల మంజూరు ఇచ్చారు. తొలుత 25శాతం నిధులు రూ.లక్షా 50వేలు విడుదల చేశారు. మిగతా పనులు పూర్తయ్యాయని, పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాల్సిందని సంబంధిత ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామారావు తెలిపారు.
- హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పనులు పూర్తయ్యాయి. ఆయా పనులకు అంచనాగా రూ.5.80లక్షలు మంజూరు ఇచ్చారు. మొదట 25శాతం నిధులు మాత్రమే విడుదల అయ్యాయని ఆ హైస్కూల్ హెచ్‌ఎం ఉమ తెలిపారు. పనులు చేసిన వారు బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు.
- పరకాల మండలంలోని 24 పాఠశాలలకు 72 పనులకు నిధులు మంజూరయినప్పటికి కేవలం 42 పనులు(మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ మరమ్మతులు, ర్యాంప్‌లు) పూర్తయ్యాయి. మరో 30 పనులు పెండింగ్‌లో ఉండ ఉన్నారు. అధికారులు బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో కాంట్రాక్టర్‌లు మరింత మొండిగా వ్యవహరిస్తూ పనులను ఆపేశారు. అయా పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులు కాంట్రాక్టర్‌లను ఆదేశించినప్పటికి పనుల్లో పురోగతి కనిపించలేదు.

మళ్లీ కాంట్రాక్టర్లకే పనులు ..

ప్రభుత్వం పాఠశాలల్లోని అమ్మ ఆదర్శ కమిటీలకు ఈ మౌలిక సదుపాయాల పనులు అప్పగిస్తే వారికి కూడా లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం భావించింది. కానీ, వివిధ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలోని మహిళా సమాఖ్యలు తమకు సివిల్‌వర్క్స్ చేయించడంలో అనుభవం లేదని, ముందుగా లక్షలు పెట్టుబడి పెట్టి పనులు చేయాల్సింటుందని ముందుకు రాలేదు. దీంతో అమ్మ ఆదర్శ కమిటీలో తీర్మానం చేయించి హెచ్‌ఎంలు.. ఇతర కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని సమాచారం. అమ్మ ఆదర్శ కమిటీలు చేపట్టనిచోట ఇతరులకు ఇవ్వొచ్చని కూడా నిబంధన ఉన్నట్లు తెలుస్తోంది. మరికొన్నిచోట్ల అమ్మ ఆదర్శ కమిటీల పేరుమీదే కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నట్లు సమాచారం. గతంలో అనుభవాల దృష్ట్యా అక్కడక్కడ కాంట్రాక్టర్లు కూడా పాఠశాలల్లో పనులు చేస్తే బిల్లులు వస్తాయా.. రావోననే అనుమానంతో ముందుకు రాని పరిస్థితి నెలకొని ఉంది. దీనికితోడు ఇంజనీరింగ్ విభాగం అధికారులు బిల్లులు, ఎంబీ రికార్డులు చేయడంలో కూడా జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రహరీ నిర్మాణానికి విరాళాల సేకరణ



ప్రహరీ లేకుండా గేట్ పిల్లర్లతో పరకాల ఎస్సీకాలనీ పాఠశాల

పరకాల: అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ.2లక్షల నిధులే మంజూరు చేయడంతో పరకాల పట్టణంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం సాధ్యం కాదని సంబంధిత కాంట్రాక్టర్ గేట్ పిల్లర్‌లు వేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో పాఠశాల ఆవరణలోకి పందులు, పశువులు వస్తున్నాయి. పిల్లలకు, నాటిన మొక్కలకు రక్షణ కరువైంది. విషయాన్ని గమనించిన అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు బొచ్చు చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టగా రూ.50వేల జమయ్యాయి. అయా విరాళాలతో పాఠశాల ప్రహరీ, గేట్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభించి..గేట్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు.



హనుమకొండ సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో వరండాలో వేసిన పాలిష్ బండలు



హనుమకొండ సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో పూర్తయిన టాయ్‌లెట్స్ బ్లాక్ పనులు

జిల్లాలోని 416 పాఠశాలల్లో ..

హనుమకొండ జిల్లాలో మొత్తం 508 పాఠశాలలు ఉండగా, అమ్మ ఆదర్శ పథకంకింద 438 పాఠశాలలను ఎంపిక చేశారు.

- అందులో 416 పాఠశాలలకు పరిపాలనాపరమైన మంజూరీ ఇచ్చారు.
- వాటిలో 1238 పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.16,98,92,000 వ్యయం అవుతుందని అంచనా వేశారు.
- పనులు చేపట్టిన ప్రతీ స్కూల్‌కు తొలుత 25శాతం నిధులు అడ్వాన్స్‌గా అమ్మ ఆదర్శ కమిటీలు, హెచ్‌ఎంల జాయింట్ అకౌంట్‌గా ఉన్న ఏఏపీసీ బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఆ విధంగా తొలుత రూ.4.22కోట్లు విడుదల చేశారు.
- 1,081 పనులు గ్రౌండింగ్ చేశారు. 991 పనులు ఇప్పటివరకు పూర్తిచేశారు. అందులో 870 పనులకు ఎంబీ రికార్డు చేశారు.
- 784పనులకు ఇప్పటివరకు రూ. 9,39,82,000 బిల్లులు చెల్లించినట్లుగా సంబంధిత అధికారులు చెబుతున్నారు.
- మొత్తంగా 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో 157 పనులు అసలే చేపట్టలేదని సమాచారం.
- ఇంకా జిల్లాకు రూ.7.59కోట్ల నిధులు రావాల్సి ఉంది.

పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాల్సింటుంది



పనులు మంజూరైన పాఠశాలల్లో 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా పూర్తిచేయాల్సింటుంది. ఆ దిశగా పర్యవేక్షణ కొనసాగుతోంది. ఇంకా పనులు ప్రారంభించని పాఠశాలల్లో ఈనెల చివరి వరకు పూర్తిచేయాలి.

- బి.మహేష్, జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్

ఐదు తరగతులకు రెండే గదులు



ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉన్నాయి. ఎప్పుడో డిపెప్ పథకంలో నిర్మించిన రెండు గదుల్లో నడిపిస్తున్నాం. 70మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదనపు తరగతి గదులకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా గదులు నిర్మించాలి.

- పెండెం రాజు, హెచ్‌ఎం, ఆత్మకూర్ పీఎస్

బల్దియాలో రాసలీలలు

- ముద్దులు, కౌగిలింతల వీడియో బహిర్గతం
- కార్యాలయాలపై కొరవడిన పర్యవేక్షణ

వరంగల్ అర్బన్ : 'గ్రేటర్ వరంగల్'.. మరో మకిలి అంటించుకుంది. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న వ్యవహారం ఏకంగా విధులు నిర్వర్తించే సీట్ల మీద ముద్దులు, కౌగిలింతల వరకు వచ్చింది.. ఇటీవల వెలుగుచూసిన ఈ వ్యవహారంపై కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విచారణకు ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బల్దియా ప్రధాన కార్యాలయం అకౌంట్ సెక్షన్‌లో కొద్ది నెలల క్రితం జూనియర్ అకౌంట్స్ ఆఫీసరు (జేఏఓ) పోస్టులు భర్తీ చేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సిన ఓ మహిళ, మరో పురుష జేఏఓ కౌగిలింతలు, ముద్దుల్లో మునిగిపోతున్నారు. కొన్ని రోజులుగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని ఇటీవల ఓ వ్యక్తి రికార్డు చేసి వెలుగులోకి తీసుకురావడంతో బల్దియాలో కలకలం రేపుతోంది. గతంలో బల్దియా కమిషనర్, టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో ఇలాంటి ఘటనలపై చర్చ జరిగింది. కానీ వెలుగులోకి రాలేదు. సుమారు 10 మంది వరకు విధులు నిర్వహిస్తున్న అకౌంట్స్ విభాగంలో వారి వ్యవహారం వీడియో రూపంలో బహిర్గతం కావడంతో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విచారణకు ఆదేశించారు. పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

సిబ్బందిపై పర్యవేక్షణ లేదు..

బల్దియా ప్రధాన కార్యాలయం, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. ఎవరు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో.. అసలు వస్తారో, రారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో అక్కడ పనిచేసే వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుండెపోటుతో తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు



శ్రీపాల్‌రెడ్డి(ఫైల్)



శ్రీపాల్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: హనుమకొండ తహసీల్దార్ కర్రె శ్రీపాల్‌రెడ్డి (47) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. గురువారం రాత్రి వరకు నగరంలోని బాలసముద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంచాయితీలో పాల్గొన్న ఆయన.. వారందరిని ఖాళీ చేయించి త్వరలోనే అర్హులకు ఇళ్లు కేటాయిస్తారని చెప్పి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం లేచి రెవెన్యూ సదస్సులు ఉన్నాయంటూ స్నానానికి సిద్ధమవుతున్న శ్రీపాల్‌రెడ్డి ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ఓ ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. వరంగల్ జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీపాల్‌రెడ్డి పదోన్నతి పొంది ఆసిఫాబాద్ జిల్లాకు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అనంతరం మళ్లీ తహసీల్దార్‌గా హనుమకొండ జిల్లాకు వచ్చి డిప్యుటేషన్‌పై 'కుడా'లో పనిచేశారు. హనుమకొండ ఆర్‌డీఓ కార్యాలయంలో డీఏఓగా కొద్దిరోజుల క్రితమే విధులు పూర్తి చేసుకుని వస్తున్న ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలుకు తీవ్ర గాయం కాగా, ప్రస్తుతం కర్ర సహాయంతోనే విధులు నిర్వహిస్తున్నారు. తమ సహచరుడిని కోల్పోవడం పట్ల రెవెన్యూ ఉద్యోగులు ఒక్కసారిగా ఆవేదనకు గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. శ్రీపాల్‌రెడ్డికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె బీటెక్, చిన్న కుమార్తె ఇంటర్ చదువుతున్నట్లు బంధువులు తెలిపారు. కాగా, ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో వెళ్లిన వారు తిరిగి అదే ప్రాంతానికి వెళాల్సి ఉంటుందని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన తిరిగి ఆసిఫాబాద్‌కు వెళ్తాననే బెంగ పెట్టుకున్నట్లు రెవెన్యూ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

నివాళులర్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్

తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి భౌతికకాయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఉన్నతాధికారులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్

కేయూ స్టాండింగ్ కమిటీలో నిర్ణయం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇవ్వనున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కాకతీయ యూనివర్సిటీలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. పలు అకాడమిక్ సిలబస్‌ల మార్పు, పరీక్షలు, దూర విద్యలో సర్టిఫికెట్ డిప్లొమా కోర్సులు, తదితర అంశాలపై చర్చించి ఆమోదించారు. ఒక క్లస్టర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పరిధిలోకి వచ్చే అధ్యాపకులు ఆ క్లస్టర్ డిగ్రీ కళాశాల నుంచే పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎంతమందికి గైడ్‌షిప్ ఇవ్వనున్నది కొద్దిరోజుల్లో తేలనుంది. అదేవిధంగా కేయూ పరిధిలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, లా విద్య (నాన్ ప్రొఫెషనల్, ప్రొఫెషనల్) కోర్సుల్లో కొన్ని సంవత్సరాలుగా ఫెయిల్ అయి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు కలిగిన విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తూ స్టాండింగ్ కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. 2025-2026 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ కోర్సుల సెమిస్టర్ల పరీక్షలతో వారు రాసుకునే అవకాశం కల్పిస్తారు. దూరవిద్యలోని ఇయర్‌వైజ్ స్కీం విద్యార్థులు కూడా బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకోవచ్చు. కేయూ దూరవిద్యలో 16వివిధ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టాలని, ఎమ్మెస్సీ జియాలజీ కోర్సులో సిలబస్ మార్పునకు ఆమోదించారు. సమావేశంలో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, వివిధ విభాగాల డీన్‌లు, పలువురు పాలక మండలి సభ్యులు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్‌గా..

- గర్భిణిపై దాడి చేసి బంగారం లాక్కెళ్లిన నిందితుడి అరెస్ట్
- 8 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

కమలాపూర్ : తాళాలు వేసి ఉన్న ఇళ్లు, ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న వంగపల్లికి చెందిన చిలువేరు ప్రశాంత్ (30)ను అరెస్ట్ చేసినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కమలాపూర్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రశాంత్ డ్రైవింగ్ వృత్తి చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీనికితోడు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి నష్టపోయి అప్పులు చేశాడు. సులువుగా డబ్బులు సంపాదించడానికి తాళం వేసిన ఇళ్లు, ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళలు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే గత నెల 30న వంగపల్లిలోని తన తల్లిగారింట్లో ఒంటరిగా ఉన్న గర్భవతి తోట దివ్యపై రాడ్‌తో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆమె చనిపోయిందని భావించి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లాడు. అదేవిధంగా తాళం వేసి ఉన్న పసుల రమాదేవి ఇంట్లో 4 తులాలు, కోడెపాక మధుసూదన్ ఇంట్లో తులం బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం తాను చోరీ చేసిన బంగారం అమ్మేందుకు వెళ్తూ కమలాపూర్ బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. గమనించిన పోలీసులు ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తాను చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.4.10 లక్షల విలువైన 8 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, కానిస్టేబుళ్లు మోహన్, ఉదయ్‌కుమార్, వెంకటేశ్‌ను ఏసీపీ అభినందించారు.

'వరంగల్ బస్‌స్టేషన్' ఆలస్యంపై అసహనం

తనిఖీ చేసిన 'కుడా'చైర్మన్, వైస్ చైర్‌పర్సన్



వరంగల్ బస్‌స్టేషన్ ప్రాంతంలో తనిఖీ చేస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణం ఎందుకింత ఆలస్యమవుతుందని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం బస్‌స్టేషన్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడే, సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు పాల్గొన్నారు. అలాగే, భద్రకాళి బండ్ పరిసరాలను పరిశీలించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి



సదస్సులో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి

వేలేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలపై తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో ఏర్పాటుచేసిన భూ భారతి సదస్సును శుక్రవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీచరలో 234 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కోమి, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ హేయనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండ్యాల రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



పెండ్యాల వద్ద వందేభారత్ రైలు, ట్రాక్‌ను పరిశీలిస్తున్న కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ ఛటర్జీ

కాజీపేట రూరల్: కాజీపేట ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండ్యాల రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సీఐ సి.ఛటర్జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛటర్జీ మాట్లాడుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లపై దుండగులు రాళ్లతో దాడికి పాల్పడుతున్నారనే ఫిర్యాదుల మేరకు 10 రోజుల నుంచి పెండ్యాల స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో రైల్వే గేట్లు, ట్రాక్ పాయింట్ల వద్ద తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాజీపేట–పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్ దాటుతూ అనుమానాస్పదంగా కనిపించిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్సై జావిద్ ఇక్బాల్, కానిస్టేబుల్ నితిన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌పై కేసు



ప్రశాంత్‌తోపాటు మిగతా వారి అరెస్ట్ చూపుతున్న సీఐ ఛటర్జీ

కాజీపేట రూరల్ : శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి కుమారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్‌తో పాటు మరో ఏడుగురిపై కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆర్‌పీఎఫ్ సీఐ ఛటర్జీ శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 27వ తేదీన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలతో కలిసి వెళ్లే క్రమంలో ఉప్పల్ రైల్వే గేట్ వద్ద ట్రాక్‌పై ఆందోళన చేపట్టిన నేపథ్యంలో సిరికొండ ప్రశాంత్, తాటి జనార్దన్, గురుకుట్ల కిరణ్, ఈర్ల రాజు, కన్నెహల ప్రకాశ్, శశికాంత్ గౌడ్, బి.ఆరిపూర్ణపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జనాలు వెళ్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఆటంకాలు సృష్టించాయని ప్రశాంత్ ఆరోపించారు. భూపాలపల్లి నుంచి సభకు వెళ్లే వాహనాలను ఉప్పల్ మీదుగా మళ్లించి ఉద్దేశపూర్వకంగా దాదాపు రెండు గంటలకు పైగా రైలు నిలిపివేశారని, తద్వారా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయన్నారు. దీంతో కేంద్ర,రాష్ట్రాల వైఖరి నిరసిస్తూ తాము రైల్వే గేట్‌వద్ద ఆందోళన చేపట్టామని, ఇందుకుగాను తనతో పాటు 14 మందిపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

త్యాగాల పండుగ.. బక్రీద్

నేడు ఈదుల్ జుహా..

- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేడుకలకు సర్వం సిద్ధం
- ఉదయం 9గంటలకు సామూహిక ప్రార్థనలు
- ఏర్పాట్లను పరిశీలించిన ఈద్గా ప్రతినిధులు

రంజాన్ తర్వాత ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ బక్రీద్ . ప్రవక్త ఇబ్రహీం కుమారుడి త్యాగానికి గుర్తుగా.. పవిత్ర మక్కా హజ్ తీర్థ యాత్రకు ముగింపుగా ఈ పండుగ సూచిస్తుంది. దాన, ధర్మాలు చేయడం ఆచారం. పేద, ధనిక తారతమ్యం లేకుండా పండుగను జరుపుకుంటారు. దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ పండుగ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఈదుల్ ఫితర్ తర్వాత రెండు నెలలకు ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల(జుల్ హజ్జా) 10వ రోజున బక్రీద్‌ను జరుపుకుంటారు. నేడు బక్రీద్ పండుగ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

–జనగామ/ఖిలా వరంగల్



జనగామ: పట్టణంలోని సిద్దిపేట రోడ్డులోని ఈద్గా



ఖిలావరంగల్: ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా

పండుగ విశిష్టత..

హజ్రత్ ఇబ్రహీం అనే ప్రవక్త నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లాహ్ కనిపించి నీ కుమారుడిని తనకు బలి ఇవ్వమని ఆదేశిస్తాడు. నిద్రలేచిన తర్వాత ఇబ్రహీం తనకు వచ్చిన కల గురించి తన ఒక్కగానొక్క కుమారుడు ఇస్మాయిల్‌కు వివరిస్తాడు. దైవ భక్తుడైన ఇస్మాయిల్ అందుకు అంగీకరించి బలికి సిద్ధమవుతాడు. దీంతో కుమారుడిని బలిస్తున్న సమయంలో అల్లాహ్ అతడి త్యాగ నిరతిని మెచ్చుకుని బలి ఇవ్వడానికి ఆకాశవాణి ద్వారా ఓ గొర్రెను సృష్టించి ఇస్తాడు. నాటి నుంచి ఈ పండుగను బక్రీద్ అని పిలుస్తారు.

ఖుర్బానీ..

బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి.. ఒక భాగాన్ని నిరుపేదలకు, మిగిలిన భాగాల్లో రెండోది బంధువులకు, మూడోది తమ కోసం ఉంచుకుంటారు. దీనిని ఖుర్బానీ అంటారు.

హజ్‌యాత్ర..

ముస్లింలు ఈ పవిత్రమైన మాసంలోనే మక్కాను సందర్శించేందుకు వెళ్తారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరం వెళ్లి మసీదు–అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణలు చేస్తారు. బక్రీద్ పండుగ రోజు ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేస్తారు. ప్రార్థనల అనంతరం ఈద్ ముబారక్‌తో ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు..

ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్(ఈదుల్ జుహా) పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గా, మసీదుల్లో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డులోని ఈద్గా, ఖిలా వరంగల్ ఈద్గాను శుభ్రపరిచి, భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు.

పోలీసు బందోబస్తు..

బక్రీద్ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈద్గాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో ఏసీపీ పండేరి చేతన్ నితిన్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్సైలు బందోబస్తు నిర్వహించనున్నారు. కాగా, ఈద్గాల వద్ద షామీయానాలతో పాటు పండగకు సంబంధించిన ఏర్పాట్లను ముస్లిం పెద్దలు పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం పెద్దల సమాధుల వద్ద నివాళులర్పించనున్నారు.

సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం



ఈద్గాలో నేడు ఉదయం 9 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. ముఖ్యఅతిథులుగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు, పోశాల పద్మ, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారు. ఉదయం 9గంటల లోపు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరై సామూహిక ప్రార్థనలు చేయాలి.

ఎంఏ జబ్బార్, ఈద్గా ప్రతినిధి, ఫోర్ట్ రోడ్డు, వరంగల్

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : వివాహేతర సంబంధాలు అంటగట్టి వేధింపులకు గురి చేసిన భర్తను కూల్‌డ్రింక్‌లో విషం కలిపి చంపిన భార్యకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి నిర్మలా గీతాంబ శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పోటియాతండాకు చెందిన లకావత్ బాలు, కవిత దంపతులకు ఇద్దరు పిల్లలు. కవిత ప్రవర్తనపై అనుమానం ఉన్న బాలు నిత్యం ఆమెకు వివాహేతర సంబంధాలు అంటగట్టి వేధింపులకు గురిచేసేవాడు. దీనిపై పలుమార్లు పంచాయితీలు జరిగినా బాలు ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదు. విసిగివేసారిన కవిత తన భర్తను ఎలాగైనా చంపి తన పిల్లలతో బతకాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో 2022 సెప్టెంబర్‌లో దంపతులు గొడవ పడగా కవిత పర్వతగిరి మండలం ఏనుగల్లులోని తన అక్క ఇంటికి పిల్లలతో సహా వెళ్లింది. అక్టోబర్‌లో బాలు ఏనుగల్లు వచ్చి భార్య పిల్లలను ఇంటికి తీసుకెళ్లాడు. వెళ్లిన రోజే తిరిగి బాలు తన భార్య కవితను అనుమానించి కొట్టి బయటకు వెళ్లిపోయాడు. ఇదే అదనుగా భావించిన కవిత కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు, యాసిడ్‌ను కలిపి పెట్టింది. ఇంటికి వచ్చిన బాలుకు విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చింది. దీంతో వాంతులు, విరోచనాలతో బాలు అర్ధరాత్రి వరకు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మరుసటి రోజు బాలును తన తమ్ముడు రమేశ్ వరంగల్ ఎంజీఎం తరలించాడు. పరిశీలించిన వైద్యులు బాలు శరీరంలో విషం ఉందని తెలిపారు. దీంతో కోపోద్రిక్తులైన బాలు కుటుంబీకులు గ్రామ పెద్దలకు తెలిపారు. వారు కవితను నిలదీయగా విషం కలిపిన విషయం ఒప్పుకుంది. ఖానాపురం పీఎస్‌లో బాలు కుటుంబీకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. చికిత్స పొందుతూ బాలు అక్టోబర్ 04, 2022న చనిపోయాడు. విషయం తెలిసిన కవిత పిల్లలను తీసుకుని పారిపోయేందుకు తమ గ్రామం పోటియాతండాకు వెళ్లగా పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు.. కవిత ఉద్దేశపూర్వకంగానే తన భర్త బాలును హత్య చేసిందని రుజువుకావడంతో జడ్జి నిర్మలా గీతాంబ.. నేరస్తురాలు కవితకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

మహిళను వేధించిన నేరస్తుడికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్ : మహిళను వేధింపులకు గురి చేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన నేరస్తుడు గొట్టిముక్కల మోహన్‌కు 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సహాయక సెషన్స్ కోర్టు జడ్జి ఎ.ప్రదీప్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రావుల దివ్య, శివకుమార్ దంపతులు కాశిబుగ్గ తిలక్‌రోడ్‌లో అద్దెకు ఉండేవారు. అదే కాంప్లెక్స్‌లో వెనుకభాగంలో ప్రైవేట్ లెక్చరర్ గొట్టిముక్కల మోహన్ అద్దెకు ఉండేవాడు. 2018, జనవరి 20వతేదీన దివ్య ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేశాడు. దీనిపై దివ్య భర్త, తల్లిదండ్రులకు తెలపగా పెద్దల సమక్షంలో మోహన్.. దివ్యను క్షమించమని వేడుకున్నాడు. నెల రోజుల తర్వాత ఇదే ఘటనపై దివ్య భర్త శివకుమార్ ఆమెను అనుమానించి ప్రియుడి కోసం కోసం ఎదురుచూస్తున్నావని మానసికంగా వేధించడంతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు మోహన్, శివకుమార్‌పై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నేరస్తుడు గొట్టిముక్కల మోహన్‌కు 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జడ్జి ప్రదీప్ తీర్పు ఇచ్చారు. భర్త శివకుమార్‌పై నేరం రుజువుకాలేదు. కేసును పోలీస్ అధికారులు ఎం.ఎ షకూర్, ఎం.శ్రీనివాస్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ కె.హరికృష్ణ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుల్ ఎం.కార్తీక్ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.మురళీధర్‌రావు కేసు వాదించారు.

ఇంజనీర్లు.. సమస్యల పరిష్కారకర్తలు



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి, కీరవాణి, వరదారెడ్డి



విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అతిథులు

- రక్షణ రంగంలో ముందుకు దూసుకెళ్తున్నాం
- డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు సతీశ్ రెడ్డి
- ఎస్సార్‌లో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు,తల్లిదండ్రులు

హసన్‌పర్తి: ఇంజనీర్లు.. కొత్త ఆవిష్కరణలు, సమస్యకు పరిష్కారకర్తలని ఏపీ ప్రభుత్వ ఎయిరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు డాక్టర్ సతీశ్ రెడ్డి పేర్కొన్నారు. నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో మూడో స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సతీశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సార్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో వంద ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు. ఇన్నోవేషన్ రంగం, అటల్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానం సాధించడం సంస్థ పరంగా గొప్ప విజయమని పేర్కొన్నారు. దేశం విద్యారంగంలో ముందుకు దూసుకెళ్తోందని వివరించారు. ఏటా 1.4 మిలియన్ ఇంజనీర్లు తయారవుతున్నారని చెప్పారు. పబ్లికేషన్, పీహెచ్‌డీ పరంగా భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. క్వాంటం టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు లాంటి రంగాల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశం రక్షణ రంగంలో స్వదేశీ శక్తితో ముందుకు వెళ్తోందన్నారు. డ్రోన్స్, రాడార్లు, మిస్సైల్ వ్యవస్థల ద్వారా భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డి.. పట్టభద్రులైన విద్యార్థులను అభినందించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కీరవాణి, ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, వైస్‌చాన్స్‌లర్‌లు మధుకర్‌రెడ్డి, డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ మహేశ్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సమావేశం అడ్డగింత

- కేయూ గేట్‌వద్ద పీడీఎస్‌యూ, ప్రజాసంఘాల నిరసన



నిరసన చేపడుతున్న వివిధ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేసుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమావేశానికి వివిధ ప్రజాసంఘాల రాష్ట్ర , జిల్లా నాయకులు కూడా వచ్చారు. సమావేశం నిర్వహించుకునేందుకు ఉపక్రమించబోగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సీఐ రవికుమార్ సిబ్బందితో వచ్చి పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌ను పిలిచి రౌండ్‌టేబుల్ సమావేశానికి అనుమతిలేదని పేర్కొన్నారు. దీనికి మహేశ్ స్పందిస్తూ తమకు రిజిస్ట్రార్ అనుమతి ఇచ్చారని తెలిపారు. అయినా పోలీసులు నిర్వహించొద్దని తేల్చిచెప్పడంతో ఇక చేసేది ఏమిలేక ప్రజాసంఘాల బాధ్యులు బయటకు వచ్చారు. రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించలేదు.

కేయూ గేట్‌వద్ద నిరసన..

యూనివర్సిటీలోని ప్రిన్సిపాల్ ఆఫీస్ ఎదుట నుంచి మొదటి గేట్ వరకు పీడీఎస్‌యూ, ప్రజాసంఘాల బాధ్యులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ మధ్యభారతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాణి, నాయకులు జయంత్, టీపీఎఫ్ రాష్ట్ర నేత బి. రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజయ్, మాజీ ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

బాలికల జట్టులో వరంగల్ జట్టుకు ప్రథమ స్థానం, బాలురలో ద్వితీయస్థానం



బాలికల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న వరంగల్ జట్టు



బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి అందుకుంటున్న వరంగల్ జట్టు

నకిరేకల్ : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 47వ హ్యాండ్‌బాల్ తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో వరంగల్ జట్టు, తృతీయ స్థానంలో నల్లగొండ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ స్థానం, ఖమ్మం జట్టు ద్వితీయ, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి.

కాజీపేట జంక్షన్ మీదుగా మరో 'వందేభారత్'

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–న్యూఢిల్లీ మధ్య వందే భారత్ స్లీపర్, ఏసీ క్లాస్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఢిల్లీ, దక్షిణ మధ్య రైల్వే అధికారులు టెక్నికల్‌గా స్పీడ్ ట్రాక్ సిద్ధం చేస్తున్నారని వారు తెలిపారు. కాగా, ఇప్పటికే సికింద్రాబాద్–నాగ్‌పూర్, నాగ్‌పూర్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–విశాఖపట్నం, విశాఖపట్నం –సికింద్రాబాద్ మధ్య నాలుగు వందేభారత్ సర్వీస్‌లు నడుస్తున్న విషయం విధితమే. కాజీపేటలో నిర్మాణమవుతున్న వ్యాగన్ షెడ్, కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట ఫిట్‌లైన్‌లను దృష్టిలో ఉంచుకుని కొత్తగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తుందని తెలిపారు. సికింద్రాబాద్ –న్యూఢిల్లీ రూట్‌లో ప్రవేశపెట్టబోయే సర్వీస్‌లతో కలుపుకుని కాజీపేట జంక్షన్‌మీదుగా ఆరు వందే భారత్ రైళ్ల సర్వీస్‌లు ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

గుంటూరులో రోడ్డు ప్రమాదం..

- గూడూరు వాసి మృతి



ఆదినారాయణ (ఫైల్)

గూడూరు: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ట్రాక్టర్ డ్రైవర్ ఏదుల ఆదినారాయణ (52) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదినారాయణ వరంగల్‌లో ఓ ట్రాక్టర్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పని చేస్తూ, ఇతర జిల్లాలు, ప్రాంతాలకు కొత్త ట్రాక్టర్లను తరలిస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుంటూరు నుంచి చిత్తూరుకు ట్రాక్టర్ తరలిస్తుండగా ప్రకాశం జిల్లా కనిగిరి మండల పామర గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు గుంటూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆదినారాయణ మృతిపై మండల కాంగ్రెస్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుంటూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహం గూడూరుకు తీసుకొస్తున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది.

24న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

- ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు

హన్మకొండ: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను ఈ నెల 24న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ, పురుష ఉద్యోగుల పదోన్నతి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతీ నెల ఆర్‌ఎం స్థాయి అధికారితో జరగాల్సిన జాయింట్ మీటింగ్‌లో బీసీ ఉద్యోగుల వ్యక్తిగత, ఇతర సమస్యలు చర్చించి పరిష్కరించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆధ్వర్యంలో జరగనున్న మహాసభలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వేణు తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోలకు చెందిన బీసీ ఉద్యోగులు ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అమాయక రైతులే లక్ష్యంగా..

ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందుల విక్రయం

- రెండు ముఠాలకు చెందిన ఏడుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు, పురుగు మందులను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం : అమాయక రైతులే లక్ష్యంగా ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఏడుగురు నిందితులను టాస్క్‌ఫోర్స్, పరకాల, గీసుకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.63.62 లక్షల విలువైన నకిలీ, గడువు తీరిన పురుగు మందులు, 166 కిలోల నకిలీ విత్తనాలు, 8 వందల లీటర్ల గడ్డి మందుతోపాటు నకిలీ పురుగు మందుల తయారీకి అవసరమైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన జయదీప్ గౌతమ్, హైదరాబాద్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, పరకాల మండల నాగారం గ్రామానికి చెందిన మాచబోయిన తిరుపతి, ములుగు గణపురం మండల చెల్పూరు చెందిన అన్నం కుమారస్వామి, గీసుకొండ మండలం ఎల్కుర్తి హవేలికి చెందిన బెరిరెడ్డి మర్రిరెడ్డి, సంగారెడ్డికి చెందిన తుమ్మగుండ్ల సందీప్‌రెడ్డి, తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్ ఉన్నట్లు సీపీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పరకాల పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రధాన నిందితుడు నాగారం గ్రామానికి చెందిన మాచబోయిన తిరుపతి ఇంటిపై దాడి చేసి నకిలీ, కాలం తీరిన పురుగు మందులు స్వాధీనం చేసుకుని విచారించారు. నిందితుడి సమాచారంతో హైదరాబాద్‌లోని మోహిదీపట్నం ప్రాంతంలో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గోదాంపై దాడి చేసి రూ.57.44 లక్షల నకిలీ, కాలం చెల్లిన పురుగు మందులు స్వాధీనం చేసుకోవడంతో పాటు జయదీప్ గౌతమ్, ఆదిత్య, కుమారస్వామిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఘటనలో గీసుకొండ పీఎస్ పరిధిలోని ఎల్కుర్తి హవేలీ ప్రాంతంలో బెరిరెడ్డి మర్రిరెడ్డి ఇంటిపై దాడి చేసి కిలో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకుని విచారించారు. నిందితుడి సమాచారంతో సంగారెడ్డి జిల్లా చింతల చెరువు గ్రామానికి చెందిన తుమ్మగుండ్ల సందీప్‌రెడ్డి, తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్ ఇళ్లలో తనిఖీ చేసి సుమారు రూ.6.18 లక్షల విలువైన 166 కిలోల నకిలీ విత్తనాలతోపాటు 8 వందల లీటర్ల గడ్డి మందు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, పరకాల, మామునూరు ఏసీపీలు వెంకటేశ్, సతీశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, సార్లరాజు, రంజిత్, క్రాంతికుమార్, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్, పరకాల ఎస్సైలు, పోలీస్ సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బాలసముద్రంలో సంకీర్తన ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : రోగులకు అందుబాటు ధరలో మెరుగైన వైద్య సేవలందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలో ఏర్పాటు చేసిన సంకీర్తన క్రిటికల్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ యాకోబు నాయక్, డాక్టర్ అర్చన, డాక్టర్ స్ఫూర్తిరావు, తదితరులు పాల్గొన్నారు.